**కథ**

# మురికి

సలీం

**వాడికి నిండా పదేళ్లుండవు. కానీ వాడి మొహంలో పసితనపు నిగారింపుకి బదులు పేదరికం బలవంతంగా రుద్దిన ముదురుతనం కనిపిస్తుంది.**

**పది రోజుల క్రితమే పార్వతమ్మ ఇంట్లో పనికి కుదిర్చాడు వాడి నాన్న.**

పార్వతమ్మ ఇద్దరు కొడుకులూ అమెరికాలో ఉన్నారు. ఇక్కడ మిగిలింది ఆమే, ఆమె భర్త. ఇద్దరికీ వయసు అరవై దాటింది. ఆయనకు కీళ్లనొప్పులు. మనిషి సరిగ్గా నడవలేడు. కూచున్న చోటి నుండి లేవాలన్నా నరకమే. ఆవిడకేమో ఇంటి పనుల్లో తీరికే దొరకదు. అందుకే చేతిసాయంగా ఉండటానికి ఎవరైనా కుర్రాణ్ణి చూసి పెట్టమని పనిమనిషితో చెప్పిపెట్టింది. ఆ పని మనిషి శీను వాళ్ల నాన్నతో విషయం చెప్పటమూ, శీను ఆ పనిలో కుదురుకోవటమూ జరిగిపోయాయి.

వాడు వడివడిగా నడుస్తున్నాడు. ఎండాకాలం కావటం వల్ల పదింటికే ఎండ చురుక్కుమంటోంది.

పనిమనిషి పదింటికి వెళ్లిపోతుంది. వాడి పని అప్పట్నుంచే మొదలవుతుంది.

బజారుకెళ్లి సరుకులు కొనుక్కుని రావటం, మెడికల్ షాపుకెళ్లి మందులు కొనుక్కుని రావటం, బట్టలు ఇస్త్రీ చేయించుకురావటం, అయ్యగారికి సిగరెట్లు తేవటం. కూరగాయలు మాత్రం అమ్మగారే కొంటారు. వాడు సంచి మోయాలి. అంతే...ఓ రకంగా చెప్పాలంటే వాణ్ణి పన్లో పెట్టుకుందే ఆయనకు చేతికింద సాయంగా ఉంటాడని.

వాడికీ పని హాయిగానే ఉంది. పెద్దగా శ్రమనిపించటం లేదు.

హాల్లో గోడకానుకుని కూచుంటాడు. "ఒరే శీనూ" అని అయ్యగారు పిలవటం తరువాయి.."వస్తున్నానయ్యా" అంటూ తూనీగలా పరుగెత్తుతాడు. అయ్యగారేదో వస్తువు కావాలంటారు. తెచ్చిస్తాడు. ఏ పుస్తకమో పేపరో అడుగుతారు. అందిస్తాడు. అప్పుడప్పుడూ కాళ్లు పట్టమంటారు.

పార్వతమ్మగారు వంటగదిలో ఉన్నప్పుడు ఫోన్ మోగితే "శీనూ...ఆ కార్డ్‌లెస్ ఇలా పట్రా" అంటూ కేకేస్తారు. వాడు పరుగెత్తుకెళ్లి ఫోనందుకుని వంటగదివైపు పరుగెత్తుతాడు.

అక్కడే తంటా అంతా. అమ్మగారు అచ్చం పార్వతీదేవిలానే ఉంటారు. తెల్లటి కళగల మొహం. నుదుట రూపాయి కాసంత కుంకుమ బొట్టు. చూస్తే కాళ్లకు మొక్కాలనిపించేలా ఉంటారు. ఆమె మొహంలో చిరాకుని వాడీ పదిరోజుల్లో ఎప్పుడూ చూళ్లేదు. ఎప్పుడూ శాంతంగా, చల్లటి చూపు...మృదువుగా, మెల్లగా మాట్లాడ్తారు.

అంతా బావుంది. కానీ పార్వతమ్మగారికి శుచీ శుభ్రం ఎక్కువ.

హాల్లో ఎక్కడా మరక కనిపించకూడదు. కిటికీల మీద దుమ్ము కనిపించకూడదు. ఆమె కళ్లకు మురికి కనిపిస్తే ఊర్కోదు.

వాణ్ణి పనిలోకి చేర్పించడానికి వాడి నాన్న పిల్చుకొచ్చిన రోజు ఆమె అన్న మాటలు గుర్తొచ్చాయి.

"నాకు శుభ్రం చాలా ఎక్కువ. వీడి బట్టలు చూడు ఎంత మురిగ్గా ఉన్నాయో. ఇలా ఉంటే ఇంటి లోపలికి రానివ్వను. రోజూ శుభ్రంగా ఉతికిన బట్టలే వేసుకురావాలి. ఇంట్లోకి వచ్చే ముందు పెరట్లోకి వెళ్లి కాళ్లూ చేతులు శుభ్రంగా కడుక్కుని రావాలి. మా పనిమనిషి వెళ్లిపోయాక ఇల్లంతా అద్దంలా ఉంచాల్సిన బాధ్యత వీడిదే. ఎక్కడైనా ఓ చిన్న మట్టి రేణువు కనిపించినా, చిన్న మరక కనిపించినా, చివరికి కాగితమ్ముక్క కనిపించినా ఊర్కోను. అన్నింటికంటే నాకు శుభ్రం ముఖ్యం. తెలిసిందా"

ఆమె మాటలు గుర్తుకు రాగానే వేగంగా నడుస్తున్నవాడల్లా రోడ్డు మధ్యలో ఠక్కున ఆగిపోయాడు. తన ఒంటి మీదున్న చొక్కా వైపు, నిక్కరు వైపు చూసుకున్నాడు. చొక్కా రెండు చోట్ల చిరుగులు పట్టింది. నిన్న వాడే ఉతుక్కున్న జత. వాడికున్నవి రెండు జతలే. పన్లో చేరక ముందు వారానికోసారి ఉతుక్కునేవాడు. ఇప్పుడు అమ్మగారికి కోపం వస్తుందేమోనని రోజూ ఓ జత ఉతుక్కుని మరునాడు వేసుకుంటున్నాడు.

"మీ అయ్యగోర్ని ఓ పాత సొక్కా ఇమ్మని అడగరాదర్రా... నువ్వేసుకుంటే పొడవుగా, జుబ్బాలా ఉంటది" అన్నాడు వాడి నాన్న.

శీనుకో అనుమానం వచ్చింది. వాళ్లయ్య చొక్కా అడగమంది తన కోసమా అతని కోసమా అని. తీరా అడిగి తెచ్చుకున్నాక, "నీకెందుకురా అంత పొడవు సొక్కా...నిండా మునిగిపోయావు. నాకిచ్చేయ్. సరిగ్గా సరిపోతుంది" అని లాగేసుకుంటాడేమో.

ఏమైనాసరే ఈ రోజు అయ్యగార్ని చొక్క అడగాలనుకున్నాడు.

నడుస్తూనే తన కాళ్లవైపు చూసుకున్నాడు. చెప్పుల్లేని కాళ్లు...దుమ్ము పట్టి ఉన్నాయి. మురికి...అమ్మగారికి ఇష్టంలేని మురికి...గుడిలాంటి ఇల్లు...మురికంటకూడదు. వెళ్లగానే శుభ్రంగా కడుక్కోవాలి మురికంతా వదిలేంత వరకు కడుక్కోవాలి.

వాడు వెళ్లే సమయానికి పార్వతమ్మ పూజగదిలోంచి వస్తోంది.

తలారా స్నానం చేసినందువల్ల తడి జుట్టుని ఆరబోసుకుంది. చలువచేసిన ఖరీదైన ఆర్గండీ చీర...పచ్చటి మేని చాయ...నుదుట ఎర్రటి కుంకుమ...మొహం ఎప్పటికి మల్లే వింత తేజస్సుతో మెరుస్తోంది.

వాడికి పార్వతమ్మని చూసినప్పుడల్లా ఆశ్చర్యమే. అంత శుభ్రంగా...సర్ఫ్ వేసి ఉతికిన తెల్లచొక్కాలా...హాల్లోని తెల్లటి పాలరాతిని తడిబట్టతో గట్టిగా తుడిచినప్పుడు మెరిసినట్లు ఆమె మెళ్లోని బంగారు నెక్లెస్ తళతళలా...ఉదయం తమ గుడిసె బైటికి వచ్చి తూర్పువైపు తలెత్తి చూసినపుడు మెరుస్తున్న... ముంచెత్తే తెల్లటి సూర్యకాంతిలా...అమ్మగారి పెరట్లో విరబూసిన సన్నజాజుల్ని కోసి కుప్పగా పోసినట్లు...ఎలా సాధ్యం అనుకుంటాడు.

పనంతా చేసుకుని తను రాత్రికి ఇంటికెళ్లబోయే ముందు కూడా ఆమె మొహంలో అదే కాంతి...అదే తేజస్సు. చీర మడత కూడా నలగదు. మొహంలో కాసింత విసుగైనా కనిపించదు. అబ్బో...ఎంత శుచీ! ఎంత శుభ్రం!

"ఏరా ఆలస్యమైందేం" అందావిడ.

వాడికేం చెప్పాలో తెలీలేదు. గోడకున్న గడియారం వైపు చూశాడు. వాడికి టైం ఎలా చూడాలో తెలీదు. ఎండ తీవ్రతని బట్టి, నీడల్ని చూసి ఉజ్జాయింపుగా సమయం ఎంతయి ఉంటుందో చెప్పే విద్య వాడి నాన్న దగ్గర నేర్చుకున్నాడు. అంతే...

"సర్లే...చేతులూ కాళ్లు శుభ్రంగా కడుక్కునిరా. నీళ్లు మరీ ఒలకబోయకు" అందామె.

వాడు పెరట్లోకెళ్లి చేతులూ కాళ్లు కడుక్కున్నాడు. వాడి నాన్న చినిగిపోయిన లుంగీలోంచి ముక్క చింపి రుమాలుగా మార్చుకుని జేబులో దాచుకున్న పాడిగుడ్డతో తుడుచుకున్నాడు.

తడికాళ్లతో చలువరాతి బండల మీద మరకలు వేయకూడదని మొదటిరోజే పార్వతమ్మ హెచ్చరించింది.

వాడు లోపలికెళ్లాక ఎప్పటికి మల్లే పార్వతమ్మ వాడి వైపు నఖశిఖపర్యంతం నిశితంగా చూసింది.

"తలేమిట్రా మాసిపోయింది? ఆ జుట్టుకు నూనె రాసుకోవా? నీకు చెప్పానా తలకు కొబ్బరినూనె రాసుకుని, నీట్‌గా దువ్వుకుని రావాలని" అందామె.

"ఇంట్లో నూనె లేదమ్మా" సంజాయిషీ ఇస్తున్నట్లు తలొంచుకుని చెప్పాడు.

"అంగట్లో ఉంటుందిగా"

"డబ్బుల్లేవమ్మా" అన్నాడు. ఆమె ఏమీ మాట్లాడకపోవటం చూసి, పొడిగింపుగా "రాత్రుళ్లు దీపంలోకి మట్టి నూనె కొంటానికే డబ్బుల్లేవంటాడు మా అయ్య. కొబ్బరి నూనె అడిగితే కొడ్తాడమ్మా" అన్నాడు.

"సర్లే..కిటికీలన్నీ దులుపు. దుమ్ము పట్టేసి ఉన్నాయి. వాటి అద్దాల్ని మరకల్లేకుండా బాగా తుడువు"

వాడా పనిలో నిమగ్నమైనాడు. చేతులు యాంత్రికంగా పనిచేసుకుపోతున్నా మనసులో మాత్రం పాతచొక్కాని ఎలా అడగాలో పదేపదే రిహార్సల్స్ వేసుకుంటున్నాడు.

"అదేం తుడవటంరా? అక్కడ చూడు.. దుమ్ముంది...కనబడడం లేదా?"

ఆలోచనల్లో మునిగి ఉన్న శీను పార్వతమ్మ గొంతు విని ఉలిక్కిపడ్డాడు.

ఆమె చూపిస్తున్న వైపు జాగ్రత్తగా చూసాడు. వాడి కళ్లకు దుమ్ము అణువంతైనా కనిపించలేదు.

"ఈ అద్దంపైన చూడు...మరక...గట్టిగా రుద్ది తుడవాలని చెప్పానా? గట్టిగా అంటే మరీ గట్టిగా కాదు. అద్దం పగిలిపోగలదు."

వాడా అద్దంవైపు కళ్లు విప్పార్చి మరీ చూశాడు. అద్దం అద్దంలా తళతళా మెరుస్తోంది తప్ప మరక కనిపించ లేదు. తనక్కనిపించని మరక ఆమెకెలా కనిపిస్తుందో వాడికర్థం కాలేదు.

మధ్యాహ్నం ఒంటిగంట దాటింది. వాడికి ఆకలివేస్తోంది.

పార్వతమ్మ ఆమె భర్త డైనింగ్ టేబుల్ దగ్గర భోజనాలకు కూచున్నారు. కంచాల, గిన్నెల శబ్దాలు...వేడి అన్నం మీంచి మూత తీసిన వెంటనే వచ్చే కమ్మటి వాసన..కూరల ఘుమఘుమలు...వాడికి ఆకలి మరింత పెరిగింది.

ఎండ నిప్పులు చెరుగుతోంది.

అన్నం తింటానికి ఇంటికెళ్లాలి. ఈ ఏండలో నడుచుకుంటూ, చెప్పుల్లేకుండా...అమ్మో! కాళ్లు నిప్పుల కుంపటిలో కూరుకుపోయినట్లు కాలుతుంటాయి. కడుపులో ఆకలి అగ్నిగుండంలా మండుతూ ఉంటుంది. నెత్తి పెనంలా మాడుతూ ఉంటుంది.

ఈ పూటకి తినకపోతేనేం. మానేస్తాను అనుకున్నాడు. కానీ ఆకలి...కడుపులో సూర్యగోళం ఉన్నట్లు..భగభగమండుతూ..బైట ఎండే నయం అనిపించింది.


అమ్మగారు నాలుగు ముద్దలు అన్నం పెడితే ఎంత బావుంటుంది. ఇక్కడే తిని, కావాలంటే ఇంకాస్త ఎక్కువ పనిచేస్తాను కదా...వాడిలో ఆశ పొంగుతూ...

కానీ ఈ పదిరోజుల్లో పార్వతమ్మ గారు ఒక్క మెతుక్కూడా విదల్చని విషయం గుర్తొచ్చి వాడి ఆశ చన్నీళ్ల స్పర్శతో ఒదిగిన పాల పొంగైంది.

వాడు పని ఆపేసి, "ఇంటికెళ్లి బువ్వ తినొస్తానమ్మా" అన్నాడు.

"సరే. తొందరగా రా. తిని పడుకోకు" అందామె.

వాడు బైటికి వస్తున్నప్పుడు అయ్యగారి మాటలు వినిపించాయి. "ఇంతెండలో ఎక్కడికి పోతాడు? ఓ ముద్ద పడేస్తే తిని ఇక్కడే పడుంటాడుగా"



"మీకేం తెలీదు ఊర్కోండి. పనోళ్లని పాపం అంటే నెత్తికెక్కి కూచుంటారు. ఐనా కేజీ పదహారు రూపాయలు పెట్టికొన్న సోనామసూరి బియ్యం...వాడికెలా పెడతాను?"

ఆ మాటలు విన్నాక వాడికి ఎండవేడిగా అనిపించ లేదు.

తిరిగొచ్చేప్పుడు...నడిస్తే కాళ్లు కాల్తాయని పరుగెత్తుకుంటూ వచ్చాడు. ఐనా కాళ్లు బొబ్బలెక్కేలా కాలాయి.

ఎప్పటికి మల్లే రాత్రి ఏడింటికే వాళ్లిద్దరూ భోజనాలు చేశారు. అంట్లన్నీ తీసి సింక్‌లో వేసేప్పుడు కూడా వాడు చొక్కా అడగటం గురించే ఆలోచిస్తున్నాడు.

పనంతా ఐపోయినా వెళ్లకుండా నిలబడ్డ శీనువైపు 'ఏమిటి?' అన్నట్లు ప్రశ్నార్థకంగా చూసింది పార్వతమ్మ.

ఎలా అడగాలో తెలీని సందిగ్ధావస్థలో వాడేమీ సమాధానం చెప్పలేదు.

"ఏంటో చెప్పు" అందావిడ.

"అయ్యగోరి పాత సొక్కా ఏదన్నా ఇప్పించమ్మా" అన్నాడు గొంతు పెగుల్చుకుని.

"నీకా మీ నాన్నకా?"

"నాకేనమ్మా. పాడవైనా సరే తొడుక్కుంటా. నాకాడ రెండే సొక్కాలున్నాయి" అలా అంటున్నప్పుడు వాడి మొహంలో దీనత్వం.

పార్వతమ్మ వాడివైపోక్షణం దీర్ఘంగా చూసింది. ఈ అడుక్కునే వెధవలందరికీ నటన పుట్టుక నుంచీ వస్తుందేమో. "పాత చొక్కాలేమీ లేవు. ఐనా పన్లోకి చేరి పది రోజులైనా కాలేదు. అప్పుడే పాత చొక్కాలు అడిగేస్తున్నావే."

శీనుకి ఆవిడ ఉద్దేశం అర్థం కాలేదు.

"పోనీ ఓ నెల పోయాక ఇవ్వండమ్మా" అన్నాడు అమాయకంగా.

"ఉంటే కదా ఇవ్వడానికి. వెళ్లు" ఆమె గొంతులోని మృదుత్వంలో మార్పు లేదు.

వాడు నిరాశని మోస్తూ బైటకి నడిచాడు.

ఆమె తలుపేసుకుంది.

అడిగే విధానంలో అడగలేదా? ఎలా అడగాలో తనకు తెలీలేదా? అనే మీమాంసలో శీను ఓ నిముషం అక్కడే నిలబడ్డాడు.

"బోల్డు పాత చొక్కాలు పడున్నాయి. నేను వాడటం కూడా లేదు. వాడికొకటిస్తే పోయేదిగా. పాపం పేద కుర్రోడు" అయ్యగారి మాటలు వినిపించాయి.

"మీకు ఈ పనోళ్ల వేషాలు తెలీవు ఊర్కోండి. పన్లోకి చేరి పది రోజులు కాకుండానే చొక్కా అడిగాడు. రేపు వాళ్లమ్మ కోసం పాత చీర అడుగుతాడు. మరో వారం పోతే కొత్త బట్టలు కొనివ్వమని డిమాండ్ చేస్తాడు. చాలా నీచమైన మనుషులు. ఒంటి మీదే కాదు బుద్ధినిండా మురికే వీళ్లకి. వాళ్లనెక్కడ పెట్టాలో అక్కడ పెడితేనే మంచిది" పార్వతమ్మ గొంతు... మృదువుగా...

★ ★ ★

వాడు పన్లోకి చేరి మూడు వారాలైంది.

అమ్మగారు ఏ సమయంలో చూసినా అంత శుభ్రంగా ఎలా ఉంటారో...మాటల్లో కోపమో చిరాకో లేకుండా అంత ప్రశాంతంగా, మృదువుగా ఎలా మాట్లాడతారో...వాడు ఆలోచిస్తూ నడుస్తున్నాడు. కసుక్కున కాలికి గాజుపెంకు గుచ్చుకుంది. "అమ్మా" అంటూ అక్కడే కూలబడ్డాడు.

పళ్ల బిగువున బాధని భరిస్తూ గాజుపెంకుని కాలిలోంచి లాగేశాడు. రక్తం...బొటబొటా కారిపోతూ...ఇంత మట్టి తీసుకుని అదిమి పట్టాడు.

కుంటుతూనే పార్వతమ్మ ఇంటికి నడిచాడు.

"ఏమైందిరా" అందామె గడప దగ్గరే.

"కాల్లో గాజుపెంకు గుచ్చుకుందమ్మా"

"అయ్యో అలానా" అంటుందనుకున్నాడు. గాయానికి రాయడానికి ఏదైనా మందు ఇస్తుందనుకున్నాడు. ఇంటి నిండా రకరకాల మందుబిళ్లలు, సీసాలు ఉన్నాయిగా. కట్టు కట్టే గుడ్డ కూడా ఉంది.

"నువ్వు కాళ్లు కడుక్కుని రా. నీ దగ్గర కాళ్లు తుడుచుకునే గుడ్డ ఉందిగా. గాయానికి గట్టిగా కట్టుకో. హాల్లో మరకలు పడితే నేనూర్కోను. అసహ్యంగా ఉంటుంది" అందామె.

వాడు పెరట్లోకెళ్లి, నీళ్లతో గాయాన్ని కడిగి, తన జేబులో ఉన్న పాత లుంగీ ముక్కతో కట్టుకట్టాడు.

నడవటం కష్టంగా ఉంది. గాయం సలుపుతోంది. ఐనా వాళ్లు చెప్పిన పన్లన్నీ చేశాడు. వాళ్లు అందివ్వమన్నవన్నీ అందించాడు.

మధ్యాహ్నమయ్యేప్పటికి వాడి ప్రాణం డస్సిపోయింది. నిస్రాణగా అనిపించింది.

పార్వతమ్మ భర్తతో కలిసి భోజనానికి కూచుంది.

శీను కదలకపోవటం చూసి "ఏరా అన్నానికెళ్లవా?" అని అడిగింది.

"కాలు నొప్పిగా ఉందమ్మా. నడవటం శానా కట్టంగా ఉంది."

"మరి అన్నం తినకుండా ఉండగలవా? సరే నీ ఇష్టం"

"ఇంతెండలో ఆ కాలికి గాయంతో వాడేం వెళ్లగలడు? ఏమైనా పెట్టు తింటానికి" అన్నాడాయన.

"ఏముంది పెట్టటానికి? అన్నం ఎప్పటిలానే మనిద్దరికి సరిపోయేంతే వండాను"

అతనేమీ మాట్లాడలేదు.

భోజనాలయ్యాక ఆమె ఫ్రిజ్జంతా వెదికింది పనికిరాని, పారేయదగిన ఆహార పదార్థాల కోసం.

రెండు బ్రెడ్‌ముక్కలు కనిపించాయి.

శీను చేతిలో పెట్టి "తినరా" అంది.

వాడు ఆకలి మీదున్నాడేమో ఆబగా నోట్లో పెట్టుకున్నాడు. పులిసిన వాసన...చేదు విషంలా..గొంతు దిగటం లేదు. వాంతికొచ్చేట్లుంది. పార్వతమ్మ చూస్తే ఏమైనా అనుకుంటుందని వాడు బైటికెళ్లి మిగిలిన బ్రెడ్‌ని పడేశాడు. వాంతయింది.

పెరట్లోని నీళ్లతో నోరంతా ఎంత కడుక్కున్నా అదోరకమైన అరుచి వదలటం లేదు. వళ్లంతా సలపరంగా అనిపించింది.

"జొరం వచ్చినట్లుందమ్మా. ఇంటికెళ్తా" అన్నాడు.

వాడిపోయి, వడలిపోయినట్లున్న వాడి మొహం వైపు ఓ క్షణం చూసి, "సరే వెళ్లు. కానీ ఈ పూట మానేసినందుకు నీ జీతంలోంచి డబ్బులు కట్ చేస్తాను" అందామె.

వాడేమీ మాట్లాడలేదు. ఆమెవైపు చూశాడు. తెల్లటి మొహంలో రూపాయి కాసంత ఎర్రటి బొట్టుతో, పాలనురగలాంటి చీరలో ఆమె ఎప్పటికిమల్లే ఉంది.

వాడు బైటికెళ్లగానే విసురుగా తలుపేసింది.

"మురికి వెధవ" గొణుక్కుంటున్నట్లుగా అంది.

❀

## మాటామంతీ

**షూటింగ్స్ టైంలో తారలు చాలా రిజర్వ్‌డ్‌గా ఉన్నట్టు కన్పిస్తారు. అందులోనూ సీనియర్స్ అయితే ఇక చెప్పనక్కర్లేదు. ఈమధ్య షాదీ నెంబర్ -1 షూటింగ్‌లో బిజీగా ఉన్న ఈషాడియోల్‌ని పలకరిస్తే ఈ సంగతే చెబుతోంది. 'షూటింగ్ ఉన్నప్పుడు ఎవ్వరితోనూ మాట్లాడాలన్పించదు. చాలా బిజీగా ఉన్న ఫీలింగ్ కలుగుతుంది. ఒకవేళ ఎవ్వరితోనైనా మాట్లాడితే కాన్‌సన్‌ట్రేషన్ దెబ్బతింటుందనిపిస్తుంది' అంటోంది. అన్నట్టు ఈమె ఈమధ్య సంజయ్‌దత్‌తో బాగా కలిసిపోయి మాట్లాడుతోంది. వీరిద్దరిమధ్య అన్ని విషయాలు చర్చకు వస్తున్నట్టున్నాయి.**

